
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి జిల్లా వార్తలు
5
శనివారం 4 జనవరి 2025



నేడు షాద్‌నగర్‌కు మంత్రి సీతక్క రాక

షాద్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్స వాలు చేయడానికి పంచాయతీరాజ్ మంత్రి సీతక్క శనివారం షాద్‌నగర్ నియోజక వర్గ పరిధిలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు పట్టణ పరిధిలోని కేశంపేట చౌరస్తా వద్ద ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంత్రికి స్వాగతం పలకనున్నారు. అనంతరం ఫరూఖ్‌నగర్ మండలం మధురాపురంలో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. అలాగే నందిగామ మండల పరిధిలోని వీర్లపల్లి, చేగూరు నుంచి సింబియాసిస్ వరకు నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులు విధి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈజీఎస్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు పని దినాల్లో విధులకు గైర్హాజరు కావొద్దన్నారు. అత్యవసరమైతే ఎంపీడీవోలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి రోజువారీగా గ్రామాల్లో నిర్వహిస్తున్న శానిటేషన్‌పై రిజిస్టర్ మెయింటెన్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వివాహం చేసుకున్న కొత్త జంటలకు ఉపాధి జాబ్ కార్డులు అందించాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మలో ఇప్పటివరకు వచ్చిన అప్లికేషన్లను ఎంపీడీవో, గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్ద పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి పీడీ శ్రీలత, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, హౌసింగ్ పీడీ నాయక్, ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

ఇస్తేమాను విజయవంతం చేయాలి

శంకర్‌పల్లి : అధికారులు సమన్వయంతో పనిచేసి ఇస్తేమాను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శంకర్‌పల్లిలోని ఇస్తేమా నిర్వహించే ప్రాంతంలో శుక్రవారం ఆయన పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏర్పాట్లపై చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఇస్తేమాలో సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. 6 ఫైరింజన్‌లు అందుబాటులో ఉంచామని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. 13 ట్రాన్స్‌ఫార్మర్‌లు బిగించి, విద్యుత్ దీపాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా 3 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచామని, 24 గంటల వైద్యసదుపాయం కల్పించామని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వివరించారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. పైప్‌లైన్ రోడ్డుతో పాటుగా రైస్‌మిల్ రోడ్డును పూర్తి చేశామని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇస్తేమా నిర్వాహకులతో సమన్వయం చేసుకుని ఆర్‌టీసీ బస్సులను ఆయా మార్గాలలో నడపాలని కలెక్టర్ ఆదేశించారు. 500 మంది సిబ్బంది శాంతిభద్రతల నిర్వహణలో పాల్గొననున్నట్లు నార్సింగి ఏసీపీ రమణగౌడ్ కలెక్టర్‌తో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల ఆర్‌డీవో చంద్రకళ, శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీవో గిరిరాజ్, నాయకులు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్‌కు ప్రోత్సాహం!



ఎకరానికి రాయితీ వివరాలు(రూ.)	
50-57 మొక్కలు	11,600
ఎరువులు, అంతర పంటలకు మొదటి సంవత్సరం	4,200
రెండో సంవత్సరం	4,200
మూడో సంవత్సరం	4,200
నాలుగో సంవత్సరం	4,200
బిందు సేద్యానికి	22,518
మొత్తం	50,918

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించింది. వరి సాగు మాదిరిగా ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటుంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆయిల్ ఉత్పత్తి పెంచాలనే ఉద్దేశంతో రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే ఆయిల్ పామ్ సాగుకు సబ్సిడీపై మొక్కలు, ఎరువులు, డ్రిప్పును అందిస్తుంది. ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- సాగును ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- పంటలకు ఉమ్మడి జిల్లా నేలలు అనుకూలం
- జిల్లాలో 3 వేల ఎకరాల్లో సాగు లక్ష్యం
- ఇప్పటి వరకు సాగైన విస్తీర్ణం 1,485 ఎకరాలు
- సబ్సిడీపై మొక్కలు, ఎరువుల అందజేత

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

రంగారెడ్డి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతుంది. రైతులకు సాగుపై ఆసక్తి కలిగించేందుకు ఉద్యాన వన శాఖ అధికారులు అవగాహన కలిగిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది మూడు వేల ఎకరాలలో పంటను సాగు జరిగేలా జిల్లా ఉద్యానశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు 1,485 ఎకరాలలో పంట సాగు చేయించడంలో ఈ శాఖ అధికారులు సఫలమయ్యారు. ఆయిల్‌పామ్ సాగును

మిగతా 8వ పేజీలో...

ఆయిల్‌పామ్ సాగు బహుబాగు

- ఈ ఏడాది లక్ష్యం మూడు వేల ఎకరాలు
- కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

వివరాలు 8లో..

సావిత్రిబాయి జీవితం ఆదర్శం

- పూలే జయంతి సందర్భంగా ఘన నివాళి
- ఆమె సేవలను కొనియాడిన నాయకులు, అధికారులు
- కాలేజీలు, స్కూళ్లలో మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం

8

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి



పురస్కారాన్ని అందజేస్తున్న శివధర్‌రెడ్డి



శిక్షణ పొందిన టీజీఎస్పీ, ఎస్‌సీటీపీఎస్‌ల ప్రదర్శన

ఇబ్రహీంపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డి అన్నారు. సైబర్ క్రైం, ఆర్థిక పరమైన, సోషల్ మీడియా ప్రేరేపిత నేరాలు పెరిగాయని... వీటిపై ఫోకస్ చేయాల్సిన అవసరముందన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని ఆక్టోపస్ క్యాంపు టీజీఎస్పీ 3వ బెటాలియన్‌లో శిక్షణ పొందిన (2024 బ్యాచ్) 288 మంది టీజీఎస్పీ, ఎస్‌సీటీపీఎస్‌ల దీక్షాంత్ పరేడ్, పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మార్గనిర్దేశం చేశారు. తెలంగాణ పోలీస్‌కు దేశంలోనే మంచి గుర్తింపు ఉందని అలాంటి శాఖలోకి వస్తున్న మీకు గురుతరమైన బాధ్యత ఉందన్నారు. ప్రస్తుతం విద్యాధికులు ఎక్కువగా ఈ ఫోర్స్‌లోకి వస్తున్నారని పోలీస్ మాన్యువల్, పరిపాలనపై అవగాహన పెంచుకొని ముందుకు పోవాల్సి అవసరం ఉందన్నారు. క్రమశిక్షణ, నిరంతర సేవ, సమాజసేవ అనేవి అతిముఖ్యమైనవన్నారు. ఇక్కడ ట్రేడ్ యూనియన్లు లాంటివి ఉండవని, క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవంటూ ఆయన హెచ్చరించారు. వీఐపీలు, వీవీఐపీల భద్రత, బందోబస్తు, మావోయిస్టు, తీవ్రవాద నిరోధక ప్రాంతాల్లో రోజుల తరబడి విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. రాజకీయపరమైన సంస్థల్లో సభ్యత్వం ఉండరాదని, ఏ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని ఇది క్రమశిక్షణ ఉల్లంఘన కిందికే వస్తుందన్నారు. క్రమశిక్షణ, విధేయత పోలీస్ బలగాలకు పునాదులని, పోలీస్ ప్రతిష్టను పెంచేలా ఉండాలి కానీ, సమస్యలను సృష్టించవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జెట్టి ప్రవీణ్, పాయం విక్రమ్, కొయ్యెడ జోసెఫ్, జంగిలి రాకేష్, బానోత్ గణేష్‌లకు శివధర్‌రెడ్డి పురస్కారాలు అందించారు. అనంతరం క్రమోగా డ్రిల్‌తోపాటు పలు ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో టీజీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జలీల్ పాష, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, శిక్షణ పూర్తి చేసుకున్న టీజీఎస్పీ, ఎస్‌సీటీపీఎస్‌ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య

కార్మికులకు అండగా సీపీఐ

- పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్మాకుల జంగయ్య

చేవెళ్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కార్మిక, కర్షక రైతు కూలీలకు ఎర్రజెండా అండగా ఉంటుందని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్మాకుల జంగయ్య తెలిపారు. సీపీఐ ఆవిర్భవించి 100 వసంతాల పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని జాలగూడెం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం, కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిన ఘనత సీపీఐకి దక్కుతుందన్నారు. అలాగే సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించి, ఆమె చేసిన సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణచారి, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మహిళ అధ్యక్షురాలు వడ్ల మంజుల, నాయకులు మీనాక్షి, వెంకటమ్మ, యాదగిరి, పెంటయ్య, బీరప్ప, సత్తయ్య, బుచ్చయ్య శ్రీకాంత్ ఉన్నారు.



నేడు జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్

తాండూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ ఈనెల 4న (నేడు) పరిగి నంబర్-1 పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు గాజుల బస్వరాజ్, ప్రధానకార్యదర్శి చంద్రమోహన్‌లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు టెస్ట్ ప్రారంభమవుతుందని అన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

బీసీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ నేత ఆర్ కృష్ణయ్య

రంగారెడ్డి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర క్యాలెండర్‌ను కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం బీసీ నేత ఆర్ కృష్ణయ్య ఆవిష్కరించారు. తెలంగాణ వైద్య సంచాలకులు డాక్టర్ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో ఆర్ కృష్ణయ్యను బీసీ ఉద్యోగుల సంఘ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ సంఘం నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, యాదయ్య, జగన్మోహన్‌రావు, మధుకుమార్ పాల్గొన్నారు.

బీసీ మహాసభల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌రావు



బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకపత్రం అందుకుంటున్న మచ్చ సుధాకర్‌రావు

చౌదరిగూడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మచ్చ సుధాకర్ రావును రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సుధాకర్‌రావుకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను చైతన్యవంతులను చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకంతో రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిస్థాయిలో కమిటీలు వేసి బీసీల మహాసభల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, నర్సింహులు, మాధవ చారి, మల్లేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రం ఏర్పాటుకు సహకరించాలి



మల్లు రవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్జాల గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని నాయకులు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవిని కోరారు. శుక్రవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రం ఏర్పాటుకు వెల్జాల అన్ని విధాల అనుకూలంగా ఉందని తెలిపారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని మల్లు రవి హామీ ఇచ్చారు. నాయకులు వెంకట్ రెడ్డి, శ్రీనివాసమూర్తి, నర్సింహులు, అజీజ్, ఆరీఫ్ తదితరులు ఉన్నారు.

గట్టిప్పలపల్లిని మండలం చేయాలి



దీక్షలో గిరిజన మహిళలు

తలకొండపల్లి , జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గిరిజన మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. పాలనా సౌలభ్యం కోసం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని 64 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదని గ్రామంలో జేఏసీ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రిలే దీక్షల్లో కూర్చున్నారు. తొమ్మిది గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ చూపి తమ డిమాండ్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవాలని కోరారు. మండలముగా ప్రకటించే వరకు పోరాటం చేస్తామని జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్లు శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్, చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో రుక్కి, రూక్లీ, సుజాత, వసంత, లక్ష్మి, బుజ్జి, పద్మ, మీరా, బాలకృష్ణమ్మ, ఇసాక్, శ్రీధర్, మాణిక్యరెడ్డి, ఆంజనేయులు, వెంకటయ్య, జంగయ్య, రాములు, బాలయ్య ఉన్నారు.

ప్రమాణస్వీకారంలో ఫ్లెక్సీ వార్

దోమ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఒకే వర్గానికి చెందిన నాయకుల ఫొటోలు ఫ్లెక్సీలో వేశారంటూ కాంగ్రెస్‌లో ఒక వర్గం వారు బ్యానర్ చించివేశారు. దీంతో పోలీసులు వారిని సముదాయించి అక్కడి నుంచి పంపించేశారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమావేశం అనంతరం భోజనం చేసేందుకు వెళ్లగా ఇంకో వర్గం వారు వెంకటేశ్, యాదగిరి, షబ్బీర్, జావీద్, నవీన్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యేతో మాట్లాడుతామని వెళ్లారు. అంతలోనే ఓ వ్యక్తి సభా ప్రాంగణంలో తిరిగి బ్యానర్ చించివేశాడు. పోలీసులు అప్రమత్తమై వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎమ్మెల్యేగా గెలిపించినందుకు అరెస్టులా?

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఎమ్మెల్యేగా రామ్మోహన్‌రెడ్డిని గెలిపించినందుకు అరెస్టు చేస్తారా అని అధికార పార్టీకి చెందిన గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్, సంపల్లి హరిబాబా, షబ్బీర్, జావీద్, నవీన్‌రెడ్డి, రవి, నరేశ్ దోమ ప్రధాన చౌరస్తాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. సొంత పార్టీ నాయకులను పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం ఏంటనీ ప్రశ్నించారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

తలకొండపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి క్రాస్ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు నిర్మించిన దిమ్మెను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అఖిలపక్ష నాయకులు ధర్నా చేపట్టారు. రోడ్డు వెడల్పులో భాగంగా స్థానిక అంబేడ్కర్ భవనం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు తొలిగించి నడీ రోడ్డుపై ఉంచారు. దీంతో మండల పరిధిలోని రాజకీయ పార్టీల నేతలు చర్చించి తలకొండపల్లి క్రాస్ రోడ్డు వద్ద అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు దిమ్మె నిర్మించారు. దానిని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తొలిగించారు. దిమ్మె తొలిగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ ఫిర్యాదు చేశారు. నాయకులు సుధాకర్, జ్యోతయ్య, రఘురాములు, రఘుపతి, వెంకటయ్య, కిష్టమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

హాస్టళ్లను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి,జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం పరిగి పట్టణంలోని బీసీ బాలుర, గిరిజన బాలుర, ప్రీ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహం, గిరిజన బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల పరిసరాలను, వంట గదులను, వంటసామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. వసతి గృహాలకు మరమ్మతులు చేయించేందుకు కావాల్సిన ప్రతిపాదనలు పంపిస్తే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అన్ని వసతి గృహాలకు నాణ్యమైన పెయింట్‌ను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్ రావు, వార్డెన్‌లు బసప్ప, రవీందర్,శంకర్‌లు ఉన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్‌లో భలే రుచి

ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్‌లో ఆహార పదార్థాలు రుచికరంగా ఉన్నాయని కలెక్టర్ ప్రతీక్‌జైన్ నిర్వాహకులకు కితాబిచ్చారు. ఆయన కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించి తిరుగు ప్రయాణంలో శుక్రవారం రాత్రి పరిగిలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్‌ను సందర్శించారు. అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహరతితో కలిసి మిర్చిలు తిన్నారు. మిర్చిలు బాగా రుచికరంగా ఉన్నాయని ఆయన కితాబిచ్చారు. మిర్చీలకు సంబంధించి డబ్బులను స్వయంగా కలెక్టరే చెల్లించారు.

మరమ్మతు పనులను వేగవంతం చేయాలి

కొడంగల్: మండలంలోని బీసీ, ఎస్సీ ఎస్టీ బాలుర వసతి గృహాలను, సాంఘిక సంక్షేమ సమీకృత బాలికల వసతి గృహాలను కలెక్టర్ ప్రతీక్‌జైన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లో మరమ్మతు పనులను వేగవంతం చేయాలన్నారు. బాలికల వసతి గృహం పరిసరాల్లో నిలిచిన మురుగు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషన్ బాల్‌రాంనాయక్‌కు సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఏఈ రాకేశ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి భీమారాజ్, వసతి గృహాల సంక్షేమ అధికారులు వరలక్ష్మి, నారాయణ, శ్రీనివాస్, హనుమంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.2వేల కోట్లు

ప్రజా అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు పనులు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గంలో పంచాయతీ రాజ్, రోడ్డు భవనాల శాఖ అధికారులతో కడా కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి రూ.2 వేల కోట్లు మంజూరైనట్లు తెలిపారు. రోడ్డు వేసే క్రమంలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టాలని సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సంజీవరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ ప్రభాకర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ నీలావతి, మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి, ఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ రాంకుమార్, ఇంజనీరింగ్ విభాగం డీఈలు, ఈఈలు పాల్గొన్నారు.

సురేశ్‌రాజ్ రెండోసారి పోలీసు కస్టడీకి..

- 4 రోజుల పాటు అనుమతించిన నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం
- మరో నిందితుడు శివకుమార్ 3 రోజుల పాటు పోలీసు కస్టడీకి
- మంగ్యానాయక్, లోక్యానాయక్‌ల కస్టడీ పిటిషన్ విచారణ సోమవారానికి వాయిదా



వికారాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల ఘటనకు సంబంధించిన ఏ-2 నిందితుడు బోగమోని సురేశ్‌రాజ్‌తో పాటు మరొక నిందితుడు శివకుమార్‌లను నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం పోలీసు కస్టడీకి అనుమతించింది. ఈ కేసులో మొత్తం నలుగురు నిందితులను పోలీసు కస్టడీకి కోరగా, వారిలో ఇద్దరిని అనుమతించగా, మరో ఇద్దరు నిందితుల కస్టడీ విచారణ సోమవారానికి వాయిదా పడింది. లగచర్ల ఘటనకు సంబంధించి తెర వెనక సూత్రధారులను గుర్తించే పనిలో నిమగ్నమైన పోలీసులు సురేశ్‌రాజ్, మంగ్యానాయక్, శివకుమార్, లోక్యానాయక్‌లను విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం విచారించింది. సురేశ్‌రాజ్‌ను నాలుగు రోజులు, శివకుమార్‌ను మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి ప్రత్యేక న్యాయస్థానం అనుమతించింది. సురేశ్‌రాజ్ చంచల్‌గూడ జైలులో, శివకుమార్ చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్నారు. సురేశ్‌రాజ్‌ను శనివారం నుంచి నాలుగు రోజుల పాటు, శివకుమార్‌ను మూడు రోజుల పాటు పోలీసులు తమ కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. లగచర్ల ఘటనలో సురేశ్‌రాజ్‌ను పోలీసులు తమ కస్టడీకి కోరడం ఇది రెండోసారి. గత డిసెంబరు 2, 3వ తేదీల్లో సురేశ్‌రాజ్‌ను తమ కస్టడీకి తీసుకుని విచారించిన పోలీసులు ఆ తర్వాత తాము సేకరించిన ఆధారాలకు అనుగుణంగా విచారణ జరిపేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఇదిలా ఉంటే, మంగ్యానాయక్, లోక్యానాయక్‌ల కస్టడీ పిటిషన్ సోమవారం నాటికి వాయిదా పడింది.

కొందుర్గు గురుకులాన్ని సందర్శించిన జోనల్ అధికారి



గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న జోనల్ ఆఫీసర్ నిర్మల

చౌదరిగూడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల బాలుర పాఠశాలను రంగారెడ్డి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్‌అధికారి నిర్మల సందర్శించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'హాస్టల్ విద్యార్థులకు ఫైన్' వసూలు చేశారు అనే వార్తకు స్పందించి గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవర్చేందుకు గైర్హాజరవుతున్న వారికి ఫైన్ విధించాలని నిబంధన ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా హాజరయ్యేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించామని తెలిపారు. విద్యార్థులు సెలవులపై వెళ్లినప్పుడు తల్లిదండ్రులు సకాలంలో స్పందించి పాఠశాలకు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

సీఎంను కలిసిన శేఖర్‌యాదవ్



శంషాబాద్ రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేఖర్‌యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్లు మంజూరు చేయాలని ధర్నా



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆమనగల్లు , జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి అవాస్ యోజన కింద మున్సిపాలిటీ పరిధిలో రెండు వేల ఇండ్లు మంజూరు చేయిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని బీజేపీ నిలబెట్టుకోవాలని శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ ఆధ్వర్యంలో కమిషనర్ వసంతకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక వర్గం పదవీకాలం ముగుస్తున్నదని, ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ చుక్క నిరంజన్‌గౌడ్, మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు సయ్యద్ ఖలీల్, నాయకులు ఎంగిళి రఘు, సాయిలు, వెంకటేశ్, శివకుమార్ ఉన్నారు.

త్వరలో మహానగరంగా మహేశ్వరం

కాంగ్రెస్ నియోజకవర్గ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న, దేప భాస్కర్‌రెడ్డి

కాంగ్రెస్ నియోజకవర్గ నేతలు మహేశ్వరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశానికే తలమానికంగా త్వరలో మహేశ్వరం మహానగరంగా మారుతుందని, అందుకు కాంగ్రెస్ నాయకులు, ప్రజలు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డితో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతంపై చర్చించినట్లు తెలిపారు. 330 ఫీట్ల రోడ్డు, ఓఆర్‌ఆర్ టు ట్రిబుల్‌ఆర్ వరకు విస్తరించే రోడ్డు, పలు రకాల పరిశ్రమలకు భూ సేకరణ సమస్య తలెత్తకుండా చూడాలని రైతులు నష్టపోకుండా పరిహారంతోపాటు ప్లాట్లు, మహిళలకు సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. ప్రపంచ స్థాయి అగ్ర సంస్థలు ఫోర్త్ సిటీకి క్యూ కడుతున్నాయని సీఎం చెప్పారన్నారు. మహేశ్వరం, కందుకూరు మండలాలను మున్సిపాలిటీలుగా మార్చడంపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు నాయకులు తెలిపారు. స్కిల్ యూనివర్సిటీతో సహా ఫోర్త్ సిటీ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి తెలిపారు.



జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన నీరటి అంజలిని అభినందిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

క్రీడల్లో రాణిస్తున్న గ్రామీణ క్రీడాకారులు

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థిని ప్రతిభ

కులకచర్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అంతారం గ్రామానికి చెందిన విద్యార్థి నీరటి అంజలి ప్రథమ బహుమతి సాధించింది. నీరటి లక్ష్మి, శివరాజ్ దంపతుల కూతురు అంజలి హకీంపేట్ క్రీడా పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. గత నెల 19, 26 తేదీల్లో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభకు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అంజలిని అభినందించారు. ఈ నెల 26 నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. పేద కుటుంబం నుంచి వచ్చిన తనను ఆదుకోవాలని ఆమె కోరింది.

పరిగి అభివృద్ధికి చర్యలు



నస్కల్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పరిగి నియోజకవర్గాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పరిగి మండలం నస్కల్ నుంచి బర్కత్‌పల్లి వరకు రూ.99 లక్షలతో తారురోడ్డు, నస్కల్‌లో రూ.20 లక్షలతో హెల్త్ సబ్‌సెంటర్,కేజీబీవీలో రూ.81 లక్షలతో అదనపు తరగతుల నిర్మాణం, రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, నర్సయాగూడెంలో రూ.20 లక్షలతో కల్వర్టు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.232 కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రూ.20 కోట్లతో పంచాయతీరాజ్ రోడ్లు, రూ.23 కోట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్లు, రూ.20 కోట్లతో తండాలకు తారు రోడ్లకు నిధులు మంజూరు వచ్చిందని తెలిపారు. రూ.10 కోట్లు ఎస్‌డీఎఫ్ నిధులు తీసుకోచ్చానని తెలిపారు. రూ.80 కోట్లతో గడిసింగాపూర్, రంగారెడ్డిపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఒక్క మున్సిపల్‌లోనే రూ.41 కోట్ల పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. రాష్ట్రంలోనే పరిగిని అగ్రగామిగా నిలుపుతానని తెలిపారు. కార్యక్రమంలో పరిగి ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్, గ్రామ ప్రత్యేకాధికారి వైజయంతి, డీసీసీ కార్యదర్శులు ఎన్.రామకృష్ణ, దండు అశోక్ పాల్గొన్నారు.



కోణాపూర్‌లో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

కోణాపూర్‌లో నాలుగు ఇళ్లలో చోరీ ● 15 గ్రా. బంగారం, రూ.8 వేల నగదు అపహరణ

తాండూరు రూరల్, జనవరి 3, (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన తాండూరు మండలం చెనిగేశ్‌పూర్ అనుబంధ గ్రామమైన కోణాపూర్‌లో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బంటు నర్సింహులు ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న మరో గదిలో నిద్రిస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఇంటి తాళాన్ని పగులగొట్టి, బీరువాలో ఉన్న పది గ్రాముల బంగారు గుండ్లతోపాటు మూడు గ్రాముల చెవి కమ్మలు, మరో రెండు గ్రాముల మ్యాట్నీలతోపాటు రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న బంటు తిప్పయ్య ఇంటికి తాళం వేసి మరో గదిలో నిద్రిస్తున్నాడు. ఆయన ఇంటి తాళం పగులగొట్టి రూ.2వేల నగదు, తిప్పయ్య దుస్తులు ఎత్తుకెళ్లారు. సమీపంలోని ఏపూర్ ప్రసాద్ కుటుంబం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఆ ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో వస్తువులు చిందరవందర చేశారు. కొన్ని వస్తువులు ఎత్తుకెళ్లారు. ఇదే గ్రామంలో రంగంపల్లి వెంకటయ్య ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి తాళం పగలగొట్టి వస్తువులన్నీ చిందరవందర చేశారు. శుక్రవారం ఉదయం లేచి చూసిన వారంతా అవాక్కయ్యారు. వెంటనే బాధితులు కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేశ్‌కు సమాచారం అందించారు. అనంతరం డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ గ్రామంలో చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనుమానితులు ఉంటే సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పామాయిల్‌కు ప్రోత్సాహం!

(5వ పేజీ తరువాయి)

ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు కేటాయిస్తున్నాయి. రానున్న పదేళ్లలో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ పంటసాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి.

ఫ్యాక్టరీల ఏర్పాటుకు సన్నాహాలు

దేశంలో వంట నూనె వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఇందుకోసం విదేశాల నుంచి పామాయిల్ గింజలను దిగుమతి చేసుకుంటున్నాం. దీనిని అధిగమించేందుకు ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులకు ప్రోత్సాహం అందించేందుకు సిద్ధమైంది. ఆయిల్ పామ్ సాగుతో మలేషియా, ఇండోనేషియా ఆర్థికంగా అభివృద్ధి చెందాయి. తెలంగాణ రైతులు కూడా రాణించాలని సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెంచే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు అనువైన నేలలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ జిల్లాల్లో ఐదు కంపెనీలు ఏర్పాటు చేసి ఆయిల్ పామ్‌ను కొనుగోలు చేయాలని సన్నాహాలు జరుగుతున్నాయి.

100 శాతం రాయితీపై డ్రిప్పు

ఆయిల్‌పామ్ సాగు చేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యం పరికరాలను వంద శాతం సబ్సిడీపై అందిస్తున్నారు. వెనుకబడిన తరగతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం రాయితీ ఇవ్వనున్నారు. 5 హెక్టార్ల వరకు డ్రిప్పు రాయితీ ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులకు, దివ్యాంగులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆయిల్‌పామ్ రైతులకు 12.5 ఎకరాల వరకు డ్రిప్పు ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తున్నారు.

రాయితీ ఇలా..

ఎకరం ఆయిల్ పామ్ సాగుకు మొక్కలు, డ్రిప్, అంతర పంటల సాగుకు, ఎరువుల యాజమాన్యం కోసం రూ.50 వేల రాయితీ కల్పించనున్నారు. మొక్కలకు రూ.11,600, బిందు సేద్యం కోసం రూ.22,518 రాయితీ ఇవ్వనున్నారు. మొదటి నాలుగేళ్లు ఎకరానికి అంతర పంటల కోసం రూ.2100, ఆయిల్ పామ్ తోట యాజమాన్యం కోసం ఎరువులకు రూ.2,100, ఒక సంవత్సరానికి రూ.4200 చొప్పున రన్నింగ్ బ్యాంకు ఖాతాలో ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తర్వాత జమ చేస్తారు.

నిరంతర ఆదాయం

ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన తర్వాత నాలుగో ఏడాది నుంచి కాపు మొదలై 30 ఏళ్లపాటు ఆదాయం పొందవచ్చు. మొదటి మూడేళ్లు అంతర పంటలు సాగుచేసుకోవచ్చు. తోటకు తెగుళ్లు, చీడపురుగుల బెడద చాలా తక్కువ. తుపాన్, వడగండ్ల వాన, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుంది. అదేవిధంగా అడవి పందులు, దొంగల బెడద ఉండదు. రవాణా, మార్కెటింగ్, ప్రాసెసింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నారు.

నాటిన ఐదేళ్ల తర్వాత దిగుబడి

ఆయిల్‌పామ్ మొక్క నాటిన సంవత్సరం నుంచి ఐదేళ్ల తర్వాత గెలలు వేయడం ద్వారా దిగుబడి మొదలవుతుంది. 25-30 సంవత్సరాల వరకు దిగుబడినిస్తుంది. సుమారుగా ఒక ఎకరానికి 10-12 టన్నులు దిగుబడి ఉంటుంది. సగటున ఒక టన్ను గెలల ధర సుమారు రూ. 10 వేలు ఉంటుంది. దీని ద్వారా ఒక రైతుకు ఒక ఎకరాకు రూ.1.25 లక్షల ఆదాయం పొందవచ్చు. ఈ విధానంలో 5 ఎకరాలకు రూ. 6.25 లక్షల నికర ఆదాయం పొందుతారు. 5 ఎకరాలకు గాను 20 సంవత్సరాలలో రూ.1.20 కోట్ల నికర ఆదాయం పొందుతారు.

అర్హులైన రైతులు వీరే..

అనువైన భూమి, పట్టాదారు పాస్ పుస్తకం, బోరు, బావి, కరెంట్ సౌకర్యం ఉన్న ప్రతి రైతు ఆయిల్ పామ్ తోటను సాగు చేసుకోవచ్చు. రైతు ఎన్ని ఎకరాల్లో అయినా పంట వేసుకునే వెసులుబాటు ఉంటుంది. 12.50 ఎకరాలకు వరకు మాత్రమే డ్రిప్ రాయితీ ఉంటుంది.



శ్రీరాంరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కను నాటుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

వివరాల కోసం..

ఇబ్రహీంపట్నం, యాచారం, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, మాడ్గుల, మంచాల మండలాలకు చెందిన రైతులు ఉద్యానవన శాఖ అధికారి నవీన (8977714219)ను సంప్రదించాలి. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, శేరిలింగంపల్లి, గండిపేట మండలాలకు చెందిన రైతులు ఉద్యానశాఖ అధికారి కీర్తి కృష్ణ (8977714222) సంప్రదించాలి. అలాగే ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్, రాజేంద్రనగర్ రైతులు ఉద్యానశాఖ అధికారి సౌమ్య (8977714221)ను సంప్రదించాలి. అదేవిధంగా షాద్‌నగర్, కేశంపేట్, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడెం, కొందుర్గు మండలాలకు చెందిన రైతులు ఉద్యానశాఖ అధికారి హిమబిందు (8977714220)ను సంప్రదించాలి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. ఈ పంట సాగు చేసుకుంటే నిరంతర ఆదాయం పొందేందుకు అవకాశముంది. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు అనువైన భూమి ఉంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. రైతులకు ప్రభుత్వం మొక్కలు, ఎరువులు, డ్రిప్పు సబ్సిడీపై అందిస్తుంది. ఆసక్తిగల రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- కె.సురేష్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

ఆయిల్ పామ్ సాగు బహుబాగు

- కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని ఆస్పల్లిగూడ గ్రామంలో శ్రీరాంరెడ్డి, రిత్విక్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర ఉద్యానవన శాఖ (హార్టికల్చర్) సహకారంతో మెగా ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ... జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు ఈ ఏడాది 3000 ఎకరాల్లో లక్ష్యం పెట్టుకున్నామని, ప్రస్తుతం 18 మండలాల్లో 330 ఎకరాల్లో ఈ మొక్కలు నాటుతున్నామన్నారు. హార్టికల్చర్ అధికారి సురేష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు పాల్గొన్నారు.

పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ

షాద్‌నగర్‌రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ పంటలతో అధిక లాభాలు సాధించవచ్చని ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి సురేష్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల శివారులో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఏపీడీ కిషన్‌రావు, హెచ్‌వో హిమబిందు, వాల్యూఆయిల్ పరిశ్రమ వైస్‌ప్రెసిడెంట్ రామ్మోహన్‌రావు, ఎండీ రామకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి జీవితం అందరికీ ఆదర్శం

- ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, యాదయ్య
- పూలే జయంతి సందర్భంగా నివాళి
- కాలేజీలు, స్కూళ్లలో మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం





షాద్‌నగర్‌అర్బన్/చేవెళ్ల : సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, యాదయ్య, నాయకులు తదితరులు

షాద్‌నగర్‌అర్బన్/షాద్‌నగర్‌రూరల్/కొత్తూర్/కేశంపేట/నందిగామ/చౌదరిగూడ/చేవెళ్ల/షాబాద్/శంషాబాద్ రూరల్/కడ్తాల్/తలకొండపల్లి/ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/ఆదిభట్ల /కందుకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరు నడుచుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఆమె జయంతిని పురస్కరించుకొని శుక్రవారం షాద్‌నగర్‌లోని సావిత్రిబాయి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ సులోచనా కృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్ తదితరులున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులను సన్మానించారు. షాద్‌నగర్ విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భవానీ శంకర్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించి, అధ్యాపకులను సన్మానించారు. 3వవార్డులోని ప్రభుత్వ పాఠశాలలో బీఆర్ఎస్ నాయకుడు అశోక్‌యాదవ్ పూలేకు నివాళులర్పించి, టీచర్లను సన్మానించారు. నాగర్‌కర్నూల్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణం సోలీపూర్ శివారులోని కళాశాలలో టీచర్లను సన్మానించారు. కొత్తూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను సన్మానించారు. ఎంఈవో అంగోర్‌నాయక్, హెచ్ఎంలు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులున్నారు. కేశంపేట తహసీల్దార్ అజాంఅలీ ఖాన్ మండల కేంద్రంలో సావిత్రిబాయి చిత్ర పటానికి అధికారులతో కలిసి నివాళులర్పించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు వేర్వేరుగా నివాళులర్పించారు. ఎంపీవో కిష్టయ్య, కాంగ్రెస్, బీజేపీ నాయకులు తదితరులున్నారు. నందిగామ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మహిళా టీచర్లను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. పార్టీ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు నాయకులున్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మహిళా టీచర్లను పద్మారం మాజీ సర్పంచ్ లక్ష్మీసుధ ఆధ్వర్యంలో సన్మానించారు. కొందుర్గు మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాల, జడ్పీహెచ్ఎస్, మండల ఎమార్సీ భవనంలో ఎంఈవో గాయిత్రీదేవి అధ్యక్షతన టీచర్లను సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ సులోచనా కృష్ణారెడ్డి, కొందుర్గు ఎంఈవో గాయత్రీదేవి ఉన్నారు. పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. షాబాద్ మండలంలోని బాలికల ఉన్నత పాఠశాల, ఆమ్నగల్ గురుకులం, మాంటిస్సోరి స్కూల్, ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలల్లో సావిత్రిబాయి విగ్రహానికి నివాళులర్పించారు. బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు నాయకులున్నారు. సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విగ్రహానికి ఆర్డీవో చంద్రకళ, ప్రజాప్రతినిధులతో కలిసి నివాళులర్పించారు. మోడల్ కాలనీలోని బాలికల గురుకుల పాఠశాలలో ఎంఈవో పురందాస్ నివాళులర్పించారు. తహసీల్దార్ కృష్ణయ్య, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాములు, మాజీ జెడ్పీటీసీ మాలతి, బీజేపీ యువ నాయకుడు వైభవ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్, సభ్యులున్నారు. శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతిని నిర్వహించారు. కళాశాల సిబ్బంది, డీఎస్ఎస్‌వో శంషాబాద్ కమిటీ సభ్యులు, లక్ష్మినివాస్ పాల్గొన్నారు. సావిత్రిబాయి జీవితాన్ని, పోరాట పటిమను ఆదర్శంగా తీసుకొని మహిళలు ముందుకు సాగాలని, బీఆర్ఎస్ కడ్తాల్ మండలాధ్యక్షుడు పరమేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణలు అన్నారు. మండల కేంద్రంలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు తదితరులున్నారు. బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. మహిళా టీచర్లను సత్కరించారు. హెచ్ఎం జంగయ్య, టీచర్లు, నాయకులున్నారు. ఆమనగల్లు పట్టణంలో జయంతిని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. కృష్ణనాయక్, ఖాదర్, అలీం, ఖరీం, ఎంగళి ప్రసాద్, తదితరులున్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతిలో పత్యానాయక్, సాయిలు, నిరంజన్, వెంకటేశ్, తదితరులున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పూలే జయంతి నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు సుధాకర్, పద్మ నర్సింహ, తదితరులున్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి హెచ్ఎం పరమేష్, భాషయ్య, మహిళా ఉపాధ్యాయురాలు లక్ష్మిదేవి నివాళులర్పించారు. మహిళా విద్యా వికాసం కోసం సావిత్రిబాయి పూలే కృషి మరువలేనిదని ఇబ్రహీంపట్నం మండల విద్యాధికారి హీర్యానాయక్ అన్నారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా టీచర్లను సన్మానించారు. తెలంగాణ పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, హెచ్ఎం వెంకటరెడ్డి, లావణ్య, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు పరమేష్, చంద్రశేఖర్, సురేష్ ఉన్నారు. ఆశ్రిత డిగ్రీ కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామ్యేల్, ప్రిన్సిపాల్ రవి తదితరులున్నారు. పాషా నరహరి కార్యాలయంలో నిర్వహించిన జయంతిలో మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయమ్మ, సుమలత, అరుణ, మున్ని తదితరులు పాల్గొన్నారు. కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంగరాజు ఆధ్వర్యంలో పూలే జయంత్రిని అధ్యాపకులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. టీచర్లను సన్మానించారు. నేదునూరు ఉన్నత పాఠశాలలో జయంతిని ఘనంగా జరుపుకున్నారు.



శంకుస్థాపన చేస్తున్న నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల అభివృద్ధే లక్ష్యం

ఆదిభట్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 5, 9వార్డులో రూ.29 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కౌన్సిలర్లు వనం శ్రీనివాస్, నల్లవోలు లావణ్యపాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ రాజు, వెంకటరెడ్డి, పల్లె శ్రీకాంత్‌గౌడ్, అమరేందర్, బాబు, నర్సింహ, ప్రవీణ్, డీఈ సిబ్బంది పాల్గొన్నారు.

మహేష్‌కుమార్ గౌడ్‌కు మధుసూదన్‌రెడ్డి శుభాకాంక్షలు



షాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): న్యూఇయర్‌ను పుస్కరించుకొని శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ ఏఎంసీ చైర్మన్ మల్లేష్, వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, డైరెక్టర్లు ఓంప్రకాష్‌రెడ్డి, రఘుపాల్‌రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు నగరంలోని ఆయన నివాసంలో కలిశారు.

నేడు జీఎంఆర్ ఎరీనాలో 5కే, 10కే రన్

శంషాబాద్ రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎంఆర్ ఎరీనాలో నేడు(శనివారం) 5కే, 10కే రన్ నిర్వహిస్తామని జీఎంఆర్ అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు రన్ ఫర్ ఏ ఫన్ పేరుతో సాయంత్రం 4.30 గంటలకు రన్ ప్రారంభమవుతుందన్నారు. ఇందులో భాగంగా డ్యాన్స్, మ్యూజిక్, ఫ్యాషన్ వంటి కార్యక్రమాలు ఉంటాయని, ఔత్సాహికులు పాల్గొనాలని చెప్పారు.

పేదలకు న్యాయ సేవలందించాలి



డైరీని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): న్యాయ సేవలను పేదలకు ఉచితంగా అందించేందుకు న్యాయవాదులు సేవాభావంతో ముందుకు రావాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కోనాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. నాయకులు గౌరె పవన్‌కుమార్‌రెడ్డి, ఐజాక్, చొక్కన్నపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డి మృతిపట్ల సంతాపం

తలకొండపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పడకల్‌కు చెందిన సీనియర్ నాయకుడు డోకూరు నరేందర్‌రెడ్డి మృతిపట్ల మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ సంతాపం తెలిపారు. శుక్రవారం నరేందర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన సోదరుడు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కుటుంబసభ్యులను పరామర్శించారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సులోచనా రెడ్డి

రైతుల శ్రేయస్సే ప్రథమ కర్తవ్యం

షాద్‌నగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు ఎలాంటి నష్టంరాకుండా చర్యలు తీసుకుంటామని, రైతుల శ్రేయస్సే ప్రథమ కర్తవ్యమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచనా రెడ్డి తెలిపారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును ఆమె పరిశీలించారు. మార్కెట్లో అదనంగా మరో 10 షెడ్డులను నిర్మిస్తామని చెప్పారు. యార్డులో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించాలని అధికారులను ఆదేశించారు. వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి తదితరులున్నారు.

అనుమతి లేకుండా వేసిన బోర్లపై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపాలిటీ మధురానగర్ బస్తీలో వాల్టా చట్టానికి విరుద్ధంగా వేసిన బోర్లపై చర్యలు తీసుకోవాలని ఎం.నరేందర్ అనే వ్యక్తి కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మధురానగర్ బస్తీలో చట్టానికి విరుద్ధంగా 2వేల ఫీట్ల వరకు బోరువేశారని తెలిపారు. అనుమతి లేకుండా బోర్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా మోహన్‌రావు



నియామక పత్రాన్ని అందజేస్తున్న సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు

శంషాబాద్ రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ శంషాబాద్ మండలాధ్యక్షుడిగా మంచర్ల మోహన్‌రావును నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈమేరకు నియామక పత్రాన్ని అందజేశారు. మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్, పీఎస్‌సీఎస్ చైర్మన్ సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఏకగ్రీవంగా మోహన్‌రావును నియామిస్తూ పార్టీ నేతలంతా తీర్మానించారు. ఈమేరకు ఎమ్మెల్యే సబితారెడ్డి, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డికి మోహన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తంగా..

- **నందిగామ** : వెంకమ్మగూడలోని సర్వేనంబరు 37లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్థులు తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కొందరు భూమిని ఆక్రమించారని ఆరోపించారు. జంగ నర్సింలు, కావలి కృష్ణ, తదితరులున్నారు.
- **శంకర్‌పల్లి** : కొండాకల్‌కు చెందిన గౌండ్ల వరుణ్‌గౌడ్ సీఎం కప్ పోటీల్లో డిస్కస్‌త్రోలో మూడో స్థానం దక్కించుకున్నాడు. వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వరుణ్‌గౌడ్ పాల్గొని సత్తా చాటాడు.
- **షాబాద్** : బీసీలు సంఘటితమై రాజకీయంగా ఎదగాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. నాగర్‌కుంటలో బీసీసేన గ్రామకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆనందం, ఉపాధ్యక్షులుగా రమేష్‌గౌడ్, అశోక్ యాదవ్, ప్రధానకార్యదర్శి రాకేష్, కార్యదర్శులు వెంకటేష్, కృష్ణ, మహేందర్, శ్రీశైలం, రవి, రమేష్, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- **చేవెళ్ల** : కందవాడ మాజీ ఎంపీటీసీ కావలి రవీందర్ ఆధ్వర్యంలో నారాయణదాస్‌గూడలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితారెడ్డి, యాదయ్యతో పాటు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.
- **కడ్తాల్** : మండల కేంద్రానికి నూతనంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంజూరైందని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ తెలిపారు. వీలైనంత త్వరగా పీఏసీఎస్ కార్యాలయం ఏర్పాటు చేయాలని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, డీసీవో సుధాకర్, సీఈవో సుబ్రమణ్యాశాస్త్రీలను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో జరిగిన రంగారెడ్డి జిల్లా డీసీసీబీ సమావేశంలో వెంకటేశ్ పాల్గొన్నారు.
- **శంషాబాద్** : తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయ్స్ యూనియన్ కార్మికులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎన్ఎంఆర్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్మికులందరికీ 8 గంటల పని అమలు పర్చాన్నారు.
- **చౌదరిగూడ** : పంచాయతీ ఎన్నికల సమరానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ అధ్యక్షుడు మచ్చ సుదాకర్‌రావు సూచించారు. కొందుర్గు మండలం బైరంపల్లి, విశ్వనాథ్‌పూర్, తంగేళ్లపల్లి, రేగడిచిల్కమర్రి, గంగన్నగూడ, శ్రీరంగాపూర్, ఆగిర్యాల తదితర గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీలను జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీంగా ఎన్నుకున్నారు.
- **ఆమనగల్లు** : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 48 గంటల నిరసన దీక్ష చేపడుతున్నట్లు ఆమనగల్లు ఏరియా సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు మున్సిపల్ కార్మిక సంఘం నాయకులతో కలిసి కమిషనర్ వసంతకు వినతిపత్రం అందజేశారు.
- **ఆమనగల్లు** : మండల బీజేపీ అధ్యక్ష ఎన్నికకు పట్టణంలోని భవాని గార్డెన్‌లో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్ హాజరయ్యారు. మండలంలో క్రియాశీల సభ్యత్వం కలిగిన కార్యకర్తల నుంచి అధ్యక్ష పదవి ఎన్నికకు అభిప్రాయ సేకరణ చేశారు.
- **యాచారం** : పీఏసీఎస్‌కు విరివిగా నిధులిస్తామని డీసీసీబీ చైర్మన్ సత్తయ్య చెప్పారు. మేడిపల్లి, మాల్ గ్రామాల్లో కొత్తగా రెండు సొసైటీలను ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతున్నట్లు వెల్లడించారు. పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదయ్యల, డైరెక్టర్లు నగరంలోని డీసీసీబీ కార్యాలయంలో ఆయనను సత్కరించారు.
- **యాచారం** : మండల ప్రగతికి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటి చైర్మన్ గురునాథ్‌రెడ్డి, యాచారం మండలంలోని మాల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, జహంగీర్, మురళి, రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డిలు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

క్రైం కార్నర్

విద్యుత్ వైర్ల చోరీ

యాచారం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందివనపర్తిలో రెండు వ్యవసాయ బోరు మోటార్లకున్న వైర్లు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన ముత్యంరెడ్డి, నారాయణరెడ్డిలు పొలం వద్ద బోరు మోటార్లు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో విద్యుత్ వైర్లను గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు అపహరించారు. దాంతో బాధిత రైతులు ఆందోళన చెందారు. కాగా, రాత్రివేళ దొంగల భయంతో పొలానికి వెళ్లాలంటేనే భయమేస్తోందని చెబుతున్నారు.

పాడిగేదెలు అపహరణ

యాచారం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నందివనపర్తిలో గురువారం రెండు పాడి గేదెలతో పాటు రెండు దూడలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. గ్రామానికి చెందిన గొరిగె చంద్రయ్య గురువారం సాయంత్రం పొలం వద్ద గేదెలు, దూడలను దొడ్డిలో కట్టేసి రాత్రి ఇంటికెళ్లాడు. శుక్రవారం ఉదయం పాలు పితకడానికి వెళ్లిచూడగా పాడి గేదెలు దూడలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గేదెల విలువ సుమారు రూ.లక్షా 50వేలు ఉంటుందని రైతు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ దాడుల్లో 22 లీటర్ల సారా స్వాధీనం

- 8 కేసులు నమోదు.. ఐదుగురి అరెస్టు

ఆమనగల్లు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కడ్తాల మండలంలో శుక్రవారం ఎక్సైజ్ శాఖ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. సీఐ బద్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో కడ్తాల మండలంలోని పల్లె చెలుక తండా, వాసుదేవ్‌పూర్, కోర్షకుంట తండాలో నిర్వహించిన దాడుల్లో 550 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. 40కిలోల బెల్లం, 10కిలోల పటిక, 22 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. దాడులకు సంబంధించి 8 కేసులు నమోదు చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. పాత్లావత్ జ్యోతి, దేపావత్ పూర్య, దేపావత్ లక్య, సభావట్ లక్ష్మి, సభావట్ నేజీలపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు

- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

నందిగామ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధి చంద్రాయన్‌గూడ సమీపంలోని పాతజాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి బస్సు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తిమృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఫరూఖ్‌నగర్ మండలం, వీర్లగూడకు చెందిన గుంటి నర్సింలు(50) అదే గ్రామానికి చెందిన సురేష్, క్రిష్ణయ్యలు ఓ ఫంక్షన్‌కు నందిగామ మండలం నర్సప్పగూడకు వచ్చారు. తిరిగి బైక్‌పై ముగ్గురు స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో నందిగామ మండలం చంద్రాయన్‌గూడ సమీపంలో పాతజాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనకాల నుంచి బైక్‌ను ఢీకొట్టింది. నర్సింలుకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నర్సింలు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మిగతా ఇద్దరికచి గాయాలవ్వడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు లింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నందిగామ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఎమ్ఎస్ఎన్ పరిశ్రమ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. చనిపోయిన వ్యక్తి నందిగామ మండలం బైపాస్ రోడ్డులో బిక్షాటన చేస్తూ ఉండేవాడని స్థానికులు తెలిపారు. శుక్రవారం ఎమ్ఎస్ఎన్ పరిశ్రమ శివారులోని బైపాస్ రోడ్డు పక్కన ఆ వ్యక్తి అచేతన స్థితిలో ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహంపై శరీరంపై ఎలాంటి దుస్తులు లేవని, వయస్సు 50 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.

'కవిత ధర్నా చేయడం విడ్డూరం'

రంగారెడ్డిఅర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఇందిరా పార్కు వద్ద జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన ధర్నా విడ్డూరంగా ఉందని పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బీసీలను విస్మరించి ఇప్పుడు కపట ప్రేమ చూపుతందన్నారు. బీఆర్ఎస్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు గురివింద గింజ తన నలుపు ఎరుగదు అన్నట్లుగా ప్రవర్తించడం మంచి సంస్కారం కాదన్నారు. ఇప్పటికైనా బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వాస్తవాన్ని గ్రహించి మాట్లాడాలని తెలిపారు.